# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 08 జూన్, 2026 | పేజీలు :06


## అంజన్నను దర్శించుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రాధాన అర్చకులు చిన్న రాము వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించి, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సూపరిండేంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ పాల్గొన్నారు.

# పొలాలకు నిప్పు...రైతుల కష్టాలు బూడిద!

### వ్యవసాయ వ్యర్థాల దహనంతో పెరుగుతున్న అగ్ని ప్రమాదాలు

### కళ్ళాలు, డ్రిప్‌లు, మోటార్లు, ధాన్యం రాశులు అగ్నికి ఆహుతి



**ప్రజాపక్షం/నిర్మల్:** వ్యవసాయ పనులు పూర్తయిన అనంతరం పంట పొలాల్లో మిగిలిపోయిన వ్యర్థాలను తొలగించేందుకు రైతులు నిప్పు పెడుతున్న ఘటనలు జిల్లాలో ఆందోళన కలిగిస్తున్నాయి. పంట అవశేషాలను త్వరగా తొలగించుకోవాలనే ఉద్దేశంతో రైతులు చేస్తున్న ఈ చర్యలు చివరికి వారి కష్టార్జిత సంపదనే బూడిదగా మారుస్తున్నాయి.ముఖ్యంగా వేసవి కాలంలో వీచే వడగాలుఉ, పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా చిన్న మంటలు సైతం క్షణాల్లో దావానలంగా మారి పక్కనే ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు వ్యాపిస్తున్నాయి. ఒక రైతు పొలంలో వ్యర్థాలకు పెట్టిన మంటలు పక్కనే ఉన్న మరో రైతు పొలంలోకి వ్యాపించి భారీ నష్టాలను మిగులుస్తున్నాయి. వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు, ప్రింక్లర్ వ్యవస్థలు, మోటార్లు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానమైన లైన్లు అగ్ని ఆహుతవుతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ సదుపాయాలు క్షణాల్లో కాలిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారు. అగ్ని ప్రమాదాల ప్రభావం కేవలం వ్యవసాయ పరికరాలకే పరిమితం కావడం లేదు. నేల సారాన్ని పెంచే సూక్ష్మ జీవులు, పంటల ఎదుగుదలకు తోడ్పడే క్రిమి కీటకాలు కూడా ఈ మంటల్లో నశిస్తున్నాయి. దీంతో భవిష్యత్ పంటల దిగుబడులపై కూడా ప్రతికూల ప్రభబూవం పడే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రీయపదార్థాలు నశించి భూసారం క్షీంచే అవకాశం కూడా ఉంది. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటన ఈ ప్రమాదకర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఒక రైతు తన పొలంలోని వ్యర్థాలను తొలగించేందుకు నిప్పు పెట్టగా, ఆ మంటలు గాలికి వేగంగా వ్యాపించి సమీపంలోని ఇతర వ్యవసాయ క్షేత్రాల్లోకి చేరుకున్నాయి. అంతేకాకుండా పక్కనే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం వైపు కూడా మంటలు దూసుకెళ్ళడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక రైతులు, గ్రామస్తులు అప్రమత్తమై వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సకాలంలో స్పందన లేకపోయి ఉంటే ధాన్యం నిల్వలు, వ్యవసాయ సామాగ్రీ పంటల పొలాలు భారీగా దగ్ధమయ్యే పరిస్థితి ఏర్పడేదని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లాలో గతంలో కూడా పలు కొనుగోలు కేంద్రాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుని రైతులు తెచ్చిన ధాన్యం రాశులు కాలిపోయిన ఘటనలు నమోదయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మకానికి తీసుకువచ్చిన రైతు కళ్ళముందే తన ధాన్యం బూడిద కావడం అత్యంత విషాదకర పరిణామంగా మారుతోంది. మరికొందరు మంచి ధర కోసం తమ కళ్ళాల్లో ధాన్యాన్ని నిల్వ ఉంచుకుంటే, ఇలాంటి మంటలు ఆ ధాన్యాన్ని కూడా మింగేస్తున్నాయి. అప్పులు చేసి సాగు చేసిన రైతుకు ఇది కోలుకోలేని ఆర్థిక దెబ్బగా మారుతోంది. అయితే ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు వ్యవసాయ శాఖ నుండి ఆశించిన స్థాయిలో అవగాహన కార్యక్రమాలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయ నిర్వహణ పద్ధతులపై రైతులకు విస్తృత స్థాయిలో శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి. గ్రామ స్థాయిలో రైతు వేదికలు, అవగాహన సమావేశాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా రైతులకు ముందస్తు హెచ్చరికలు, సూచనలు అందిస్తే ఇలాంటి ఘటనలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. పంట వ్యర్థాలను కాల్చడం తాత్కాలిక పరిష్కారంగా కనిపించానా, అది చివరికి రైతులకే భారీ నష్టాలను మిగులుస్తోందన్న వాస్తవాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. రైతుల కష్టం, పంట ఆస్తులను కాపాడాలంటే వ్యవసాయ శాఖ రెవెన్యూ అగ్నిమాపక శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టి గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన సమయం ఆసన్నమైంది. రైతులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి పంట అవశేషాల దహనానికి దూరంగా ఉంటేనే ఇటువంటి అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

### ఇండియన్ ఆర్మీలో యువకులు

## ఉద్యోగాలు పొందడం ఆనందదాయకం




### ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :** ఇండియన్ ఆర్మీలో యువకులు ఉద్యోగాలు సాధించడం ఆనంద దాయకమన్నారు. జగిత్యాల ఎస్ కె ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో యజ్ఞ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ అగ్ని వీర్ నియామక పరీక్షలలో 12 మంది యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన 12 మంది యువకులను ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. గతంలో కొందరు నిరుద్యోగ యువకులు రన్నింగ్ ట్రాక్ లేక ఉద్యోగాలు పొందలేదని తెలిసి ట్రాక్ ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ సహకారం తో జగిత్యాల కు స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. జగిత్యాల లో క్రీడల అభివృద్ధి కి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, కౌన్సిలర్లు ఏనుగుల లావణ్య రాజు, దయల చంద్రకళ శంకర్, కూతురు శేఖర్, తదితరులు ఉన్నారు.

### ముస్సోరీ గుడ్ గవర్నెన్స్ కార్యక్రమానికి

## కరీంనగర్ మున్సిపల్ కమిషనర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరీలోని లాల్ బహదూర్ జాతీయ పరిపాలన అకాడమీ వేదికగా ప్రతిష్టాత్మక నిర్వహించే ప్రత్యేక ఉన్నత స్థాయి కార్యక్రమానికి తెలంగాణ నుండి కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఎంపికయ్యారు. సోమవారం జూన్ 8 నుండి 13 వరకు వారం రోజుల పాటు జరిగే గుడ్ గవర్నెన్స్ ఫర్ ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్ ( క్షేత్ర స్థాయి నిర్వాహకుల సుపరిపాలన) కార్యక్రమంలో పాల్గొనను న్నారు, భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిపాలన ఉన్నత స్థాయి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం నుండి సమర్థవంతమైన ముగ్గురు ఐఏఎస్ అధికారులను ఎంపిక చేసింది. ఇందులో కరీంనగర్ నగరపాలక సంస్థ ఐఏఎస్ అధికారులైన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ మంద మకరందు, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి. రాహుల్ కు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. గుడ్ గవర్నెన్స్ ఫర్ ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయి పరిపాలనలో ఉత్తమ విధానాలు, పారదర్శకత, ప్రజలకు మరింత మెరుగైన పాలన, వేగవంతమైన సేవలు అందించడం, మున్సిపల్ వ్యవహారాల్లో సరికొత్త సంస్కరణలు తీసుకురావడం పై కార్యక్రమంలో వారం రోజుల పాటు వివరించనున్నారు. ఈ సంధర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గుడ్ గవర్నెన్స్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎంపిక చేయడం హర్షనీయమన్నారు. ఉన్నత స్థాయి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంబంధిత కార్యక్రమ ఎజెండా అంశాల ఆధారంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రజలకు క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన పాలన, సరికొత్త అభివృద్ధి సంస్కరణలు ఎంతగానో దోహద పడుతాయని వెల్లడించారు.

# పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

ప్రజాపక్షం/వీణవంక : కేంద్ర ప్రభుత్వం తాజాగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌పై రూ.29 పెంచిందని వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్ డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం 3 నెలల కాలంలో రెండుసార్లు గ్యాస్ ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. బిజెపి పాలనలో అచ్ఛే దినాలు లేవని చచ్చే దినాలు వచ్చాయన్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండగా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడి నెలవారి బడ్జెట్‌ను తలకిందులు చేసిందన్నారు. దేశభక్తి పేరుతో దేశ సంపదను కార్పోరేటర్లకు కట్టబెడుతూ సామాన్యులపై మోయలేని అధిక భారాలు వేస్తుందని ఆర్థిక అసమానతలు వేగంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు గ్యాస్ సిలిండర్ ఆన్‌లైన్‌లో



బుక్ చేసి 20 రోజులు దాటినా వినియోగదారునికి సిలిండర్ అందడం లేదన్నారు. తక్షణమే మోదీ ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలు తగ్గించి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సేకరించి సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు.

## అల్లీపూర్ శక్తి కేంద్రం అధ్యక్షుడిగా మణికంఠ



ప్రజాపక్షం/రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ అధ్యర్యంలో పార్టీ ఆదేశాల మేరకు నూతన గ్రామ కమిటీని ఆదివారం గ్రామ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో శక్తి కేంద్రం అధ్యక్షుడిగా ఇనుకగుర్తి మణికంఠను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ శక్తి కేంద్రం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన బాజాపా కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చేయడానికి కుటుంబ సభ్యులందరికీ సహకారంతో పార్టీని బలోపేతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలే చంద్రశేఖర్, సీనియర్ నాయకులు అంగడి పరమేశ్వర్, రాజశేఖర్, రాజగోపాల్, రమేష్, మల్లికార్జున్, రచన్, శశిధర్, ఆదర్శ్, నందు, మణికంఠ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనాధగా మారిన మంగ... పట్టించుకునే వారెవరూ?

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన భూసారపు మంగ గౌడ్ అనే యువతి (సుమారు 30 సంవత్సరాలు) దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తోంది.చిన్న వయసులోనే తల్లిదండ్రుల తో పాటు రెండో అన్నాను కోల్పోయిన మంగకు ఆధారంగా ఉన్న ఆమె పెద్ద అన్న సత్తయ్య గౌడ్ ఇటీవలే ఆరు నెలల క్రితం మరణించడంతో ఆమె పూర్తిగా అనాధగా మారింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మంగ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యింది. అయితే మానసిక స్థితి సరిగా లేకపోవడం, కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఆ ఇంటిలో ఒంటరిగా జీవించడం కూడా కష్టసాధ్యంగా మారింది.ప్రస్తుతం ఆమె గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ,దొరికిన చోట తలదాచుకుంటూ కాలం గడుపుతోంది.సరైన ఆహారం, వైద్య సేవలు, సంరక్షణ లేకపోవడంతో ఆమె పరిస్థితి రోజురో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మంగను ప్రభుత్వం వెంటనే గుర్తించి, సంబంధిత అధికారులు స్పందించి కేర్ హోమ్, ఆశ్రయ కేంద్రం లేదా మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తరలించి పూర్తి సంరక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.అనాధగా మారి, జీవన పోరాటంలో ఒంటరిగా మిగిలిపోయిన మంగకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలిచి మానవతా దృక్పథంతో ఆధారం కోల్పోయిన మంగకు చేయూతను అందించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కెల్లేడు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి



ప్రజాపక్షం/మానకొండూర్ : మండలంలోని కెల్లేడు గ్రామానికి ఆర్టీసీ బస్ సౌకర్యం పునరుద్ధరించి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలని ఆదివారం గ్రామ సర్పంచ్ ఆడెపు రజిత విజయ్ కరీంనగర్ డిపో రీజనల్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. కెల్లేడు గ్రామంలో సుమారు 3 వేలకు పైగా జనాభా ఉందని కరీంనగర్ డిపో నుంచి కెల్లేడు గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్ సౌకర్యం ఉండేదని రంగపేట ఎక్స్‌రోడ్ నుంచి కెల్లేడు గ్రామం మీదుగా పచ్చునూర్ గ్రామానికి వెళ్లేదారిలో చెట్ల కొమ్మలు ఉండి సింగిల్ రోడ్డు సరిగా లేకపోవడం వల్ల బస్‌ను నిలిపివేశారని దీంతో అప్పటి నుంచి ఇప్పటివరకు బస్ సౌకర్యం లేక గ్రామ ప్రజలు, మహిళలు, విద్యార్థులు రోజువారికూలీలు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి ప్రైవేట్ వాహనాలలో ప్రయాణం కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం దారిలో చెట్ల కొమ్మలను తొలగించి రోడ్ వెడల్పు చేసినందున బస్సుల రాకపోకలకు ఏలాంటి ఇబ్బంది లేదని కావున కరీంనగర్ నుంచి జమ్మికుంటకు వెళ్లే బస్సులు రంగపేట ఎక్స్‌రోడ్ నుంచి వయా కందుల పల్లి గ్రామంతోపాటు కెల్లేడు గ్రామం మీదుగా మద్ది కుంట, పచ్చునూర్ నుంచి జమ్మికుంట వరకు రోజుకు అప్ అండ్ డౌన్ తో కలిపి 8 ట్రిప్పుల బస్ సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజల పక్షాన సర్పంచ్ కోరారు.

## అగ్నివీర్‌కు సాన్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు




ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్ రేకుర్తిలోని సాన్వీ డిఫెన్స్ అకాడమీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ నియామకాల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో వరంగల్లో జరిగిన ఆర్మీ ఒపెన్ ర్యాలీలో పాల్గొని మే 31న ప్రకటించిన ఫలితాల్లో సాన్వీ డిఫెన్స్ అకాడమీ విద్యాసంస్థల నుంచి ఆర్మీ వివిధ ట్రేడ్‌లలో మొత్తం 56 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని అన్నారు. మా కళాశాలలో చదివిన అనేకమంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులు సాధించారని, ఎంసెట్, ఐఐటీ పోటీ పరీక్షల్లో సైతం ఉత్తమ ప్రతిభ చూపి మంచి ర్యాంకులు సాధించారని అన్నారు. పెద్దమొత్తంలో డిఫెన్స్ ఉద్యోగాలు సాధించడం గర్వకారణంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్షణ రంగంలో మెరిసిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ



ప్రజాపక్షం/కొత్తపల్లి : గత నెల మే 30వ తేదిన వెలువడిన ఇండియన్ ఆర్మీ ఫలితాల్లో వివిధ విభాగాలలో తమ అకాడమీ నుంచి 193 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ విభాగంలో 157, టెక్నికల్ విభాగంలో 17, ట్రేడ్స్మెన్ విభాగంలో 14, క్లర్క్ 1, ఎయిర్‌ఫోర్స్ విభాగంలో 4 ఉద్యోగాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న అభ్యర్థుల ఎంపిక విధానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ శ్రద్ధ వహిస్తోందని అన్నారు. విద్యార్థులకు ప్రశ్నల సరళిపై కఠినతా స్థాయిలపై అవగాహన పెంపొందేలా ప్రతిరోజు పరీక్షలు నిర్వహించడమే కాకుండా వారి అభ్యాసన సామర్థ్యాలు పెంచుకునేలా వారిలోని లోపాలు తెలుసుకొని సవరించుకునేలా గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల్లో విజయం సాధించేలా నిష్టాతులుగా తీర్చిదిద్దడంలో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ఎప్పుడు ముందుంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఒక స్పష్టమైన నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలని దానికోసం నిరంతరం కృషి చేయాలన్నారు. చేసే పనిని తపస్సుతో భావించాలని అప్పుడే ప్రతి ఒక్కరూ విజయం సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ లక్ష్యాలపై దృష్టి పెట్టేలా వాటి సాధనకై నిరంతరం కృషి చేసేలా ప్రోత్సహిస్తూ వారి పరీక్షలకు అనుగుణంగా శారీరక, మానసిక అభ్యాసాలని అందిస్తుండడం వల్ల మా అకాడమీ విద్యార్థులు రాత, శారీరక పరీక్షల్లో విజయం సాధిస్తున్నట్లు వివరించారు. ఇంతటి విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి, సిబ్బందికి ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యున్నత బోధనా ప్రణాళికలతో శిక్షణ అందిస్తూ అన్ని ఆర్మీ ర్యాలీలలో అద్భుతమైన విజయాలు నమోదు చేస్తున్న ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో సైనికి ఉద్యోగాల ఆశావాహులు, నిరుద్యోగులు చేరి ఉద్యోగులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజాపక్షం/జమ్మికుంట : ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 99 రోజుల కార్యచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులతో గడిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యచరణలో హ్యాపీ సండే కార్యక్రమంలో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండడం కోసం వారంలో ఒక రోజైన ఆదివారం ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగురి సురేష్ మాచర్ల రాజు, దిడ్డి రాము, మేనేజర్ జి.రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రమేష్ ఏఈ వికాస్, గోవింద, కుమారస్వామి, సాయి, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## శారీఫంక్షన్‌కు హాజరైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి కుమార్తె ప్రణతి శారి ఫంక్షన్ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా రాజన్న సిరిసిల్లా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, దొమ్మాటనర్సయ్య, ముక్కశంకర్, గుర్రాల రాజిరెడ్డి ,బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపుకృష్ణారెడ్డి, మాజి జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు.సెస్ డైరెక్టర్ వర్సకృష్ణహరి, పలువురు సీనియర్ నాయకులు, బంధుమిత్రులు, పలు వ్యాపార సంఘం ప్రతినిధులు హాజరై ప్రణతిని ఆశీర్వదించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/రాయికల్: రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో 200405 పదవతరగతి బ్యాచ్ విద్యార్థులు రెండు దశాబ్దాల కాలం తర్వాత ఆదివారం రాయికల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాల జ్ఞాపకాలు ను పంచుకున్నారు.ఆనాడు తమకు వివిధ సబ్జెక్టులను బోధించిన ఉపాధ్యాయులు నాగభూషణం, మీనయ్య, జయ,శిరీష,జ్యోతి మరియు పొన్నం రమేష్ బోధనాలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా 200405 బ్యాచ్ విద్యార్థులు పలువురు పూర్వ విద్యార్థులు తమ విజయాలకు పాఠశాల అందించిన విద్య ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమని పలువురు అన్నారు ప్రస్తుత విద్యార్థులకు విద్యా ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇరవైసంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకునే అవకాశం వచ్చిందని ఆనందించారు. ఉపాధ్యాయులు పొన్నం రమేష్ మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపే స్థాయికి విద్యార్థులు ఎదగడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుర్రం రజిత, రాణవేణి, గంగమణి , ఇంద్రాల రజని, బైరి శ్రీకళ, మచ్చ ప్రత్యక్ష, రాధ, రాజ్యలక్ష్మి , ఉడత మానస, పాల్గొన్నారు.

# ప్రపంచ తెలుగు మహాసభల్లో మెట్‌పల్లి కవుల ప్రతిభ



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** రాజమహేంద్రవరంలో శనివారం ప్రారంభమైన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో మెట్‌పల్లికి చెందిన జాతీయ సాహిత్య పరిషత్ సభ్యులు తమ కవితా ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారు.పరిషత్ సభ్యులు పెండెం శివానంద్, సోప్పరి శ్రీనివాస్,తంగళ్లపల్లి నవీన్ కుమార్‌లు మహాసభల్లో పాల్గొని తెలుగు భాష వైభవం, సాహిత్య గొప్పతనాన్ని ప్రతిబింబించే కవితలను ఆలపించి సభికుల ప్రశంసలు అందుకున్నారు.అనంతరం నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు నంబి రాజేంద్ర శర్మ,ప్రధాన కార్యదర్శి మ్రరి భాస్కర్, కోశాధికారి గుంటుక అశోక్,ప్రచార కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, పెరంబుదూర్ లింబగిరి స్వామి, బండి సుధాకర్, బాస మంజుల, గుంటుక గంగాధర్,గౌరవ అధ్యక్షులు మట్టెల గంగాధర్,ఉపాధ్యక్షుడు గుర్రాల మాధవ్, ఉపాధ్యక్షురాలు మాడభూషి భూలక్ష్మి తదితరులు కవులను అభినందించారు.సాహిత్య రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని తెలుగు భాషా సేవలో విశిష్ట కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలో రెడ్డి, వెలుమ,పురగిరి క్షత్రియ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా జరుపుకున్నారు. డప్పు చప్పులతో,మహిళలు నెత్తిన బోనాలతో పోచమ్మ వద్దకు బయలుదేరి నైవేద్యం సమర్పించి కొబ్బరి కాయల తో మొక్కులు చెల్లించుకున్నారు.ఏడాది లో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని డాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.చిన్నారులు డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేయగా మహిళలు బోనాలతో తరలివెళ్లారు. ఈ వేడుకల్లో సర్పంచ్ ఆదిరెడ్డి, వెలుమ, పురగిరి క్షత్రియ సంఘనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా కార్యదర్శిగా ఏనుగు ముత్యం రెడ్డి

**ప్రజాపక్షం/రాయికల్:** నిజామాబాద్ (ఇందూరు) పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్, జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు యాదగిరి బాబు, జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణిల ఆదేశాల మేరకు, భూపతిపూర్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డిని బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమించారు.ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ముత్యం రెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఏనుగు ముత్యం రెడ్డి మాట్లాడుతూ తనకు జిల్లా కార్యదర్శిగా అవకాశం కల్పించిన ఎంపీ ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆకుల మహేష్, ప్రధాన కార్యదర్శులు సాయి రాజ్ గౌడ్, ఏనుగు రవీందర్, ఉపాధ్యక్షులు వట్టిమల్ల శ్రీనివాస్, ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు తిరుపతి నాయక్ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగిత్యాలలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎల్ఎల్ గార్డెన్ ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ఇండియన్ చీఫ్ ఇన్స్ట్రక్చర్ ఎగ్జామినర్ శ్రీను బాబు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కరాటే అసోసియేషన్ చైర్మన్ ఎం లింగయ్య ,జగిత్యాల జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆర్మూల పవన్, తదితరులు ఉన్నారు.

## బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శికి సన్మానం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఆత్మకూర్ గ్రామ కార్యదర్శిగా గత 7 సంవత్సరాలుగా గ్రామానికి పంచాయతీ కార్యదర్శిగా సేవలు అందించిన శ్రీ వాణి ఇటీవల బదిలీ పై పెగడపల్లి మండలం వెళ్లిన సందర్భంగా కార్యదర్శి శ్రీవాణి సేవలను గ్రామాభివృద్ధికి చేసినటువంటి కృషికి గ్రామ సర్పంచ్ రాజం పోచవ్వ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్స్, అంగన్వాడీ, ఆశ, గ్రామ కారోబర్, గ్రామ సిబ్బంది గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి పంచాయతీ కార్యదర్శి గా గత ఏడు సంవత్సరాలుగా శ్రీవాణి విధులు నిర్వహించి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. అలాంటి వ్యక్తి ఇటీవల బదిలీపై వెళ్లడం ఒకపక్క బాధాకరం మరోపక్క వృత్తి పట్ల బదిలీపై వెళ్లడం సంతోషకరంగా ఉందని అన్నారు. ఆమె గ్రామనికి చేసిన సేవలు కరోనా వ్యాప్తి చెందకుండా గ్రామంలో తీసుకున్న చర్యలు ఉపాధి హామీ పథకంలో అందరికి పని కల్పించి ఆత్మకూర్ గ్రామాన్ని మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిపిన విధానం ఎప్పటికి గుర్తుండి పోతాయని ప్రసంశించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేసినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం ప్రకటించారని గ్రామపంచాయతీ సిబ్బంది ఆమె శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించడం మాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజం పోచవ్వ,ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రంతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ప్రజలకు సూచించారు. తేజ హాస్పిటల్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం కల్లేడ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డా.జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వారు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, శుభ్రమైన నీటిని మాత్రమే తాగడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని వారు చెప్పారు.వ్యాధుల బారిన పడినపుడు తేలికపాటి,పోషకాహారం తీసుకోవడంతో పాటు ఎక్కువగా ద్రవ పదార్థాలు, కొబ్బరి నీరు, పండ్ల రసాలు తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి సరైన చికిత్స పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో తేజ హాస్పిటల్ వైద్యులు వేణు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. గ్రామ సర్పంచ్ గంగోత్రి పరశురాం మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జువ్వాడి వివాహ వార్షికోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/మల్లాపూర్:** రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వడి నరసింహారావురజని దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో, అలాగే వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేసి వేడుకలు జరుపుకొని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. రత్నాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ, స్థానిక సర్పంచ్ గొండ రాజందర్ ఆధ్వర్యంలో మల్లన్న స్వామి ఆలయంలో జువ్వాడి వివాహ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అట్టహాసంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమలలో ఏఎంసీ చైర్మన్ అంతడుపుల పుష్పాలత నరసయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ నల్ల బాపూరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు పుంద్రా శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సరికేల మహిపాల్ , రవీందర్, ఎర్ర భూమయ్య,ఆనంద్ గౌడ్, మల్లయ్య, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## పోచమ్మ తల్లికి మొదటి బోనం



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో విశ్వకర్మల ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి ఆదివారం ఎదురు బోనాలు ఘనంగా సమర్పించారు.ఈ సందర్భంగా మాతాలు ఇంటింటికి బోనం తీస్తూ డప్పు చప్పుళ్ళు పోతరాజుల నడుమ భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. తెలంగాణ ప్రాంతంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బోనాల పండుగ గ్రామ దేవతల పురాణ కథల ప్రకారం పాతకాలం నాటి ఆనవాయితీగ పోచమ్మ తల్లికి మొదటి బోనం విశ్వకర్మలచే సమర్పించడం జరుగుతుంది ఇందులో భాగంగా మొదటి బోనం తిప్పర్తి రాజు స్వప్న దంపతుల చేతుల మీదుగా శాస్త్ర యుక్తంగా పోచమ్మ తల్లికి మొదటి బోనం సమర్పించబడింది .అనంతరం గ్రామంలోని మిగతా వాళ్లందరూ కూడా భోనం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు తాడూరి సత్యనారాయణ, అధ్యక్షులు పోలుకల రాజ గణేష్. నరసింహ చారి, భూమయ్య, ప్రభాకర్ సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మెట్పల్లి విద్యార్థుల సత్తా

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాలలోని పవన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో మెట్పల్లి కేంద్రానికి చెందిన అవినాష్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో అకాడమీకి చెందిన 9 మంది విద్యార్థులు కాటా, స్పారింగ్ విభాగాల్లో పలు పతకాలు సాధించారు.అండర్ 14 విభాగంలో జాహ్నవి, పవిత్ర, మణీంద్ర, సంధ్య బంగారు పతాకాలు సాధించగా, అండర్ 10 విభాగంలో విశృతి శ్రీ, మాన్వీ వెండి పథకాలు, అండర్ 12 విభాగంలోఆరాధ్య శ్రీ, హర్ష, శోభన్ కాంస్య, కిషోర్ పతాకాలు సాధించినట్లు జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్లు జోగు శివాని, తిమ్మని రోహిత్, తిమ్మని రోషన్‌ల తో పాటు విజేతలను గ్రామస్తులు,క్రీడాభిమానులు పలువురు అభినందించారు.

## ఓటర్ల జాబితా సవరణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఆదివారం బిఎల్ఎ2లకు బిజెపి మండల ప్రత్యేక కార్యశాల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. అనూప్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాసన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏలేటి నరేందర్ రెడ్డి పాల్గొని ఓటర్ల జాబితా సవరణ, బిఎల్ఎ2ల బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుంచు రణధీర్,పంతంగి వెంకటేష్ యాదవ్,శ్రీధర్ రెడ్డి, వేణు,సతీష్,దేవన్న, ఏళ్ళ శ్రీనివాస్, వెంకటస్వామి,నవీన్ రెడ్డి,శ్రీనివాస్,తదితర నాయకులు,కార్యకర్తలు,బిఎల్ఎ2లు పాల్గొన్నారు.

## రక్తదానం చేసే యువతికి ప్రాణదానం చేసిన అంబారిపేట గ్రామ సర్పంచ్

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:** జగిత్యాల రూరల్ మండలం లక్ష్మి పూర్ గ్రామానికి చెందిన చెరుకు ప్రవీణ అమ్మాయికి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చేరగా ఆత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరం ఉంది అని డాక్టర్ తెలుపగా పేషెంట్ బంధువులు రక్త దాత కోసం చూడగా జగిత్యాల అర్బన్ అంబారిపేట గ్రామ సర్పంచ్ గోడిశేల గంగాధర్ తెలుపగా వెంటనే స్పందించిన గంగాధర్ చేయడానికి ముందుకు వచ్చి రక్తదానం చేసి యువతి ప్రాణాలు కాపాడారు. రక్తదానం చేసి యువతి ప్రాణాలు కాపాడిన సర్పంచ్ గంగాధర్ కి పేషెంట్ బంధువులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూనే ప్రజలు బాగుండాలి అని ఒక గొప్ప సేవా గుణం ఉన్న నాయకుడు, ప్రజా సేవకుడు గంగాధర్ అని గ్రామ ప్రజలు పలువురు సర్పంచ్ గంగాధర్ ను అభినందించారు.

# నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం ఆదివారం నీటిని విడుదల చేయడం జరుగుతుందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ఆయకట్టు పరిధిలో సాయంత్రం 4 గం.లకు 1000 క్యూసెక్కుల నీటిని కాలువ ద్వారా విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నీటిని కేవలం పశువులు, పశువుల కాపర్లు, జీవాల తాగు నీటి అవసరాల కొరకు విడుదల చేస్తున్నామని, రైతులు సాగునీటి అవసరాలకు వాడుకోరాదని, ముఖ్యంగా ఎవరూ నీటి ప్రవాహంలోకి దిగరాదని సూచించారు.

# పిట్లం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలిగా రూపాదస్తాగౌడ్



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఎన్నుకున్నారు. పిట్లం సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా అన్నారం గ్రామ సర్పంచు రూపాదస్తాగౌడ్‌ను మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా కళావతి గంగారాం, రపధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా విఠల్, జాయింట్ సెక్రెటరీగా రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి మండల సర్పంచులు తమ అభినందనలు తెలియజేశారు.

# ఐటీఐ నూతన ప్రిన్సిపాల్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ నూతన ప్రిన్సిపాల్‌గా వై. రమేష్ బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల నుంచి బదిలీపై జన్నారంకు వచ్చిన ఆయన శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జన్నారం ఐటీఐలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన రాములు సిరిసిల్లకు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సంస్థ అభివృద్ధికి సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తానన్నారు.

# కెజిబివి నస్పూర్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** నస్పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం జూనియర్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రత్యేక అధికారి ఎంకుక తెలిపారు. జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం 20 సీట్లు, బైపిసి మొదటి సంవత్సరం 20 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే 6వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు జూన్ 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# రోడ్డు పెరిగే.. పాఠశాల మునిగే?

## విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం!



**ప్రజాపక్షం/నేరడిగొండ:** మండలంలోని వాంకిడి గ్రామం నుండి రాజురా ఈస్పూర్ తదితర గ్రామాలకు రాకపోకలు కొనసాగించడానికి కనీస అవసరాలైన మౌళిక సదుపాయాల కల్పనాలో భాగంగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. వాంకిడి చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఒకే ఒక జిల్లా పరిషత్ పాఠశాల అందుబాటులో ఉంది. ఈ పాఠశాలకు నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నత విద్యకై రాకపోకలు కొనసాగిస్తుంటారు. పాఠశాలకు ఆనుకుని ముందు పక్కా భాగం, రెండవ పక్క పాఠశాల చుట్టూ ప్రహరీ కంటే ఎత్తుగా తారు రోడ్డు నిర్మించి పాఠశాలకు వెళ్ళ రాకుండా కాంట్రాక్టర్ ఈ నిర్మాణాలను చేపట్టారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చుట్టు ప్రహరీ కంటే ఎత్తులో తారు రోడ్డు వేయడం వల్ల పాఠశాలకు కనీస భద్రత ఏర్పాట్లు చేయకుండా (సేఫ్టీ) చర్యలు చేపట్టకుండా ఈ నిర్మాణాన్ని నిర్మించారాని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఒక వేళ వాహన చోదకులకు ఎటువంటి సమస్యలు తలెత్తిన పాఠశాలలోకి ప్రమాదపు వాహనాలు దూసుకు వచ్చే బోల్తాపడే ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. రహదారి వెంబడి వెదజల్లే దుమ్ము ధూళి వర్షపు నీరు పాఠశాలలోకి చేరి చెరువును తపించే ప్రమాదం ఉందని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మేధావులు అంటున్నారు. పాఠశాలకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ప్రమాదాలు సంభవించడమే కాకుండా భవిష్యత్తులో ఎటువంటి అనర్తలు ప్రమాదాలు ఎదుర్కొవాల్సి వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనను వెలిబుచ్చారు. ఈ నిర్మాణాలలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుందని ఆరోపిస్తున్నారు. కనీసం విద్యార్థుల భద్రతకు సంబంధించి తారు రోడ్డుపై పాఠశాల ప్రహరీ చుట్టూ రైలింగ్ నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ప్రమాదం పొంచి ఉందని అంటున్నారు. సదర్ కాంట్రాక్టర్ ఇప్పటికైనా పాఠశాలలు పునః ప్రారంభానికి సమయం ఉన్నందున ప్రమాదాలు ఏర్పడక ముందే తగిన చర్యలు తీసుకుని పాఠశాలకు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రైలింగ్‌ను నిర్మించి విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోవడానికి రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

# అధికారుల నిర్లక్ష్యమే కార్మికుల ప్రమాదాలకు కారణమా..?

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియా లోని ఆర్కే న్యూటెక్ గనిలో రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదం మరవకముందే, ఏరియాలోని ఎస్ఆర్‌పి 3 గనిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదం కార్మికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తుంది. 5 సీమ్, జీరో లెవెల్, ఎండ్ లెస్, 7 డ్రెస్ జంక్షన్ వద్ద ట్రామార్ గా విధులు నిర్వహిస్తున్న దండు శ్రీకాంత్ భర్తీ పడితే లేపుతున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో నడుముకు దెబ్బ తగిలి తీవ్ర గాయాల పాలయ్యాడు. అప్రమత్తమైన తోటి కార్మికులు వెంటనే ఆర్‌కె 8 డిస్పెన్సరీ, అక్కడనుండి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్య చికిత్స కొరకు హైదరాబాద్ రిఫర్ చేశారు. ప్రమాదం సంభవించిన కార్మికులను సర్ఫేస్ కు తీసుకు రావడానికి సక్రమమైన మ్యాన్ రైడింగ్ సదుపాయం లేకపోవడంతో కాలినడకతో తీసుకువెళ్లామని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఫుల్ గ్రేడింగ్ మైన్ కావడం, మ్యాన్ రైడింగ్ సదుపాయం లేకపోవడంతో కార్మికులు సరిగా విధులకు హాజరు కాకపోవడంతో సంస్థ ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని పలువురు కార్మికులు విమర్శిస్తున్నారు. మ్యాన్ రైడింగ్ విషయంలో ఇంజనీరు స్పందించడం లేదని, ఒకే చోట 18 సంవత్సరాల నుండి ఉంటున్నాడని ఆరోపణల సైతం వినిపిస్తున్నాయి. మ్యాన్ రైడింగ్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. అధికారులకు, కార్మికులకు మధ్య సమన్వయ లోపంతో సంస్థ ఉత్పత్తి పరంగా నష్టానికి గురికావాల్సి వస్తుందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గనిలో వెంటిలేషన్ సదుపాయం లేకపోవడం వలన కూడా తీవ్రమైన అస్వస్థతకు గురికావాల్సి వస్తుందని పేర్కొన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు జరిగిన ప్రమాదంపై పరిశీలన చేసి, భవిష్యత్తులో ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కార్మికులు డిమాండ్ చేశారు.

# తిమ్మాపూర్ గ్రామ కార్యదర్శి లావణ్యకు ఘన వీడ్కోలు



**ప్రజాపక్షం / జన్నారం :** తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఏడు సంవత్సరాలు సేవలందించి, దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి బదిలీపై వెళ్తున్న మేక లావణ్యకు ఆదివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగులావత్ సంగీత రవి నాయక్, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ మాట్లాడుతూ ప్రజలకు చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. లావణ్య గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేసి, వివాదాలకు తావులేకుండా విధులు నిర్వహించారని కొనియాడారు. మేక లావణ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలు, పాలకవర్గ సభ్యుల సహకారం వల్లే అభివృద్ధి సాధ్యమైందని, తిమ్మాపూర్‌లో ఎన్నో అనుభవాలు నేర్చుకున్నానని తెలిపారు. అలాగే, తిమ్మాపూర్ నూతన గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కళ్యాణిని గ్రామ పెద్దలు, నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగేష్, మాజీ ఉపసర్పంచ్ అనుసూరి పద్మ, వార్డు సభ్యులు సిద్ధం స్వప్న, దేవికా కృష్ణవేణి, కాటికారి జ్యోతి, మల్లేష్, బోర్లకుంట శంకరయ్య, నాయకులు గుగ్లావత్ రవి, జాడీ వెంకటయ్య, చిందం చంద్రయ్య, బొర్లకుంట వెంకటమ్మ, జునుగురి మల్లయ్య, జాడి రాజన్న, జునుగిరి లక్ష్మి, జాడి లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు సంజీవ, రాణి, జమున, ఆశా వర్కర్ రజిత, యుగంధర్, శ్రీనివాస్, అమ్మల భూమయ్య, సుధాకర్, భూమయ్య, చిందం శ్రీనివాస్, శ్రావణ్, మల్లేష్, కే.

# బావిలో పడి యువ రైతు మృతి



**ప్రజాపక్షం / జన్నారం :** మండలంలోని చింతగూడ గ్రామ శివారులో బావిలో పడి ఓ యువ రైతు మృతి చెందాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ జి. ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం చింతగూడ గ్రామానికి చెందిన గజ్జెల మల్లేష్ కుమారుడు గజ్జెల భూపతి శనివారం ఉదయం తమ పాలేరు చక్రం లచ్చుతో కలిసి కౌలుకు చేస్తున్న భూమిలో మొక్కజొన్న పంట వ్యర్థాలను తొలగించేందుకు వెళ్లాడు. ఉదయం సుమారు 9 గంటల సమయంలో భూపతి బహిర్భూమికి వెళ్లి, అనంతరం పక్కనే ఉన్న బియ్యాల మల్లేశ్ భూమిలోని బావి వద్ద చేతులు కడుక్కునే క్రమంలో ప్రమాదవశాత్తూ లోపల పడి నీట మునిగి మృతి చెందాడు. మృతుడు భూపతికి ఏడాది క్రితమే వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి గజ్జెల మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# రిమ్స్ కార్మికుల బకాయి.. జీతాలు వెంటనే చెల్లించాలి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి రెండు నెలల బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఏ.అనసూయ, కార్యదర్శి ఈ ఉమా డిమాండ్ చేశారు. ఆదివారం రిమ్స్‌లో కార్మికులతో కలిసి వారు మాట్లాడారు. పాఠశాలలు తెరుస్తున్న సమయంలో జీతాలు ఇవ్వకపోవడంతో పిల్లల చదువుల కోసం కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ ఆదేశించినా అధికారులు పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను ఖాతాల్లో జమ చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం పెంచిన వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రెండు రోజుల్లో జీతాలు ఇవ్వకుంటే పనులు బంద్ చేస్తామని హెచ్చరించారు. కొంత మంది నాయకులు కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ కల్లోలం సృష్టించాలని చూస్తున్నారని, వాటిని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోల మోహన్, ప్రమోద్, వంశీ, కార్మికులు లక్ష్మి, సారిక, అనిత, రాధా పాల్గొన్నారు.

# కజ్జర్ల గ్రామంలో.. మార్కెట్ అధికారులకు సన్మానం



**ప్రజాపక్షం/తలమడుగు:** తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు ఆదివారం గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా 20 వేల క్వింటాళ్ల జొన్నల కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశారు.కజ్జర్ల గ్రామ రైతుల ఆధ్వర్యంలో మార్కెట్ అధికారులతో పాటు, గ్రామానికి చెందిన ఆదిలాబాద్ మార్కెట్ డైరెక్టర్ పోషెట్టిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్మ నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ గంగన్న, రైతులు చింతలపల్లి జైభారత్‌రెడ్డి, స్వామి రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, శరత్, స్వామి, తిరుపతి, శ్రీనివాస్, రఘువరన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ భోనాల జాతర



**ప్రజాపక్షం/మావల:** మండలంలోని చందా(టి) గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున ఆలయానిక చేరుకుని సామూహికంగా భోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బూర్గుపల్లి-జి గ్రామంలో బడిబాట కార్యక్రమం

ప్రజాపక్షం / సర్నాపూర్ (జి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి, డ్రాప్ ఔట్‌లను తగ్గించడానికి కార్పొరేట్‌కు ధీటుగా విద్యను అందించడానికి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా బడిబాట కార్యక్రమం చేపడుతుంది. సర్నాపూజ్ (జి) మండలం బూర్గుపల్లి జి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరూ కలిసి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుండడంతో ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు.గ్రామ సర్పంచ్ అరుణ్‌లాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నిమ్మ రాకేష్, ప్రధానోపాధ్యాయులు పావని, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కీబోర్డ్ ప్లేయర్‌లో గిన్నిస్ రికార్డ్ సాధించిన జోయ్ అభిగేల్

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : ఎలక్ట్రానిక్ కీబోర్డ్ వాయిద్యంలో అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు సంపాదించుకున్న నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామానికి చెందిన దేవోళ్ల జోయ్ అభిగేల్ (అనూష)ను ఆదివారం టీఎన్జీఓల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ, మన జిల్లాకు చెందిన బాలిక అంతర్జాతీయ స్థాయిలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం మనకందరికి ఎంతో గర్వ కారణమని కొనియాడారు. జోయ్ అభిగేల్ అసాధారణ ప్రతిభను, నిరంతర కృషిని ఆయన అభినందించారు. ఇంతటి ఘనత సాధించేలా ఆమెను నిరంతరం ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘన సన్మాన కార్యక్రమంలో టీఎన్జీఓ కోశాధికారి భీమ సురేందర్, సెక్రెటరీ కె.ఆనంద్, సంఘం జిల్లా అధ్యక్షుడు వై. అశోక్ కుమార్, ప్రముఖ నాయకు లు సత్యనారాయణ గౌడ్, సుకుమార్, ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు డి.రా ములు, అలాగే నాయకులు అశోక్, ము త్యన్న, ఆర్ .స్వామి, మరియు దేవోళ్ళ గంగా రాం తదితరులు పాల్గొని బాలికను అభినందించారు.

## ఎస్పి, ఎఎస్పి ఆదేశాల మేరకు ప్రత్యేక వాహన తనిఖీ

ప్రజాపక్షం / భైంసా : భైంసా పట్టణంలో ఎస్పీ, ఏఎస్పీ భైంసా ఆదేశాల మేరకు ప్రత్యేక వాహన తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోగా, మొత్తం 20 వాహనాలను సీజ్ చేయడం జరిగింది. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు లేకుండా నడపడం, నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం మరియు ట్రిపుల్ రైడింగ్ వంటి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయబడినవి. మైనర్ డ్రైవింగ్ 11, డాక్యుమెంట్లు లేకుండా వాహనాలు నడపడం 5 ట్రిపుల్ రైడింగ్ 1 నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు3, మొత్తం కేసులు 20 అదే విధంగా, మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన బాల బాలికలు వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, రహదారి భద్రతపై కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయబడినవి.

# మృగశిర వేళ మత్స్యకారులకు కోలుకోలేని దెబ్బ

డబ్బులు ఇవ్వకుండా ఐదు క్వింటాళ్ల చేపలు ఎత్తుకెళ్లిన జనాలు,లబోదిబోమంటున్న బాధితులు..



ప్రజాపక్షం/ఎడపల్లి: వర్షాకాలానికి నాంది పలికే మృగశిర కార్తె నేడు ప్రారంభం కానుంది. మృగశిర కార్తె రోజున చేపలు తినడం అనాదిగా వస్తున్న అనవాయితీ కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. అయితే ఇదే తరుణంలో మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరిగింది. కష్టపడి తెచ్చిన చేపలను జనాలు ఉచితంగా ఎత్తుకెళ్లడంతో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. ఠాణాకలాన్ శివారులోని చెరువుల నుంచి మృగశిర కార్తె డిమాండ్ కోసం మత్స్యకారులు శ్రమించి చేపలను పట్టి విక్రయానికి తెచ్చారు. సుమారు ఐదు క్వింటాళ్ల చేపలను విక్రయించేందుకు సిద్ధం చేయగా, ఒక్కసారిగా పెద్ద ఎత్తున జనాలు అక్కడకు చేరుకున్నారు. కొనుగోలు చేయాల్సిన జనాలు కాస్తా, ఒక్కసారిగా చేపలపై ఎగబడి డబ్బులు ఇవ్వకుండానే వారికి దొరికిన చేపలను వారు ఎత్తుకెళ్లారు. మృగశిర కార్తె కోసం ఎంతో కష్టపడి చెరువుల నుంచి చేపలు పట్టి తెచ్చామని, తీరా ఇక్కడికి వచ్చాక ఠాణాకలాన్ గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాలకు చెందిన జనాలు కూడా ఎగబడి డబ్బులు ఇవ్వకుండానే సుమారు ఐదు క్వింటాళ్ల చేపలను దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారని మత్స్యకారుడు సుంద నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని బాధితుడు సుంద నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృగశిర వేళ తమ పొట్ట కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖరీఫ్ సేద్యం కోసం ఉగాది తరువాత పొలాలను దుక్కిదున్ని విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకొని, రోహిణి కార్తెలో కురిసిన ఓ మోస్తరు వర్షానికి రైతులు వరి, కంది, పెసర సాగుకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. జూన్ మొదటి వారంలో వచ్చే మృగశిర కార్తె వర్షానికి సూచికగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పండుగ వాతావరణంలో మారుతున్న వాతావరణానికి అనుగుణంగా ఆహార నియమాలు పాటిస్తూ, వ్యవసాయ పనులను ముమ్మరం చేస్తారు.

# నిర్మల్‌లో ముమ్మరంగా అభివృద్ధి, సేవా కార్యక్రమాలు

మూడు సంస్థలను ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి




ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : నిర్మల్ నియోజకవర్గ పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆదివారం పలు అభివృద్ధి, సేవా సంస్థలను ఘనంగా ప్రారంభించారు. విద్య, వైద్యం, మరియు ఉపాధి రంగాలకు చెందిన మూడు వేర్వేరు కేంద్రాలను ఒకే రోజు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మొదటగా నిర్మల్ మండలంలోని చిట్యాల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇషా పారాలసిస్ సెంటర్‌ను వైస్ చైర్మెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పక్షవాతం బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు, ఫిజియోథెరఫీ, పునరావాస సేవలు అందించేందుకు ఈ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోనే ఇలాంటి మెరుగైన చికిత్సా సౌకర్యాలు లభించడం లభినందనీయమని పేర్కొంటూ, రోగులకు అంకితభావంతో సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని మంజులాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఢిల్లీ వరల్డ్ స్కూల్' ను ఆయన ప్రారంభించి, తరగతి గదులను మరియు పాఠశాల వసతులను పరిశీలించారు. విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు సమగ్ర వ్యక్తి వికాసం అందించాలనే లక్ష్యంతో, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేసేందుకు ఈ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా నిర్మల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎన్.వీ.ఆర్' ఇంటర్నేషనల్ మాన్ పవర్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని వైస్ చైర్మెన్ ప్రారంభించారు. యువతకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇటువంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకుని, లభించే ఉత్తమ ఉద్యోగ అవకాశాలను అందుకోవాలని సూచిస్తూ సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆధునిక విద్యా, వైద్య, ఉపాధి సౌకర్యాలు అందుబాటులోకి రావడం చాలా సంతోషకరమని, నిర్వాహకులు బాధ్యతతో సేవలు అందించాలని ఈ సందర్భంగా అప్పాల గణేష్ చక్రవర్తి కోరారు. పాఠశాల యాజమాన్యం, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విద్యా సంస్థలు విజ్ఞాన నిలయాలా ? వ్యాపార కేంద్రాలా ?

సివైఎస్ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శితల్కర్ అరవింద్

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల ఇష్టారాజ్యంపై అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని చాత్ర యువ సంఘర్షణ సమితి (సివైఎస్ఎస్) నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీల్కర్ అరవింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు విద్యను సేవగా భావిస్తే, ఇప్పుడు దానిని పూర్తి స్థాయి వ్యాపారంగా మార్చేశారని ఆయన ఆరోపించారు. జిల్లాలోని 19 మండలాల్లో ఏలాంటి ప్రత్యేక అనుమతులు లేకుండానే ఐఐటి, జేఈఈ, నీట్ ఫౌండేషన్, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ స్కూల్ వంటి ఆకర్షణీయమైన తోక పేర్లతో బోర్డులు తగిలించి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ బ్రాండ్ పేర్లను నమ్మి మధ్యతరగతి కుటుంబాలు అప్పుల పాలవుతున్నారని అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్ళలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోయినా, విద్యాశాఖాధికారులు తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చిన్న పిల్లలపై ర్యాంకులు, హోంవర్క్, పేరిట మానసిక ఒత్తిడి పెంచి వారి బాల్యాన్ని దూరం చేస్తున్నారని, పుస్తకాలు, యూనిఫాంలను నిర్దిష్ట దుకాణాల్లోనే కొనాలని బలవంతం చేస్తూ లక్షలాది రూపాయల అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు స్కూళ్లపై తక్షణమే ప్రభుత్వం ప్రత్యేక విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అనుమతులు లేని పాఠశాలలను వెంటనే మూసి వేయాలని అధిక ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తప్పుడు ప్రకటనలతో ప్రజలను ఆకర్షించే విద్యా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల పిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# కమ్మర్‌పల్లిలో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మృగశిర కార్తె చేపలకు భలే గిరాకీ

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆదివారం ప్రజలు చేపలు కొనుగోలు చేయటంతో మార్కెట్ సందడిగా మారింది. పూర్వీకుల నుండి వస్తున్న ఆచారం ప్రకారం మృగశిర కార్తె నాడు చేపలు తింటే మంచిదని ఆచరిస్తూ ప్రజలు ధరలను ఏ మాత్రం లెక్క చేయకుండా కొనుగోలు చేశారు. మత్స్యకారులు ఉదయం నుంచి చెరువుల్లో చేపలు పట్టి గ్రామాల్లో విక్రయించారు.

## తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో శాలివాహన (కుమ్మర) ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాశిరోమణి అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్ళాలని అన్నారు. జిల్లాకు, దేశానికి మంచిపేరు తేవాలని, విద్యను ఎవరు దొంగిలించే అవకాశం లేదని, విద్యతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భూపతి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు కనకం గంగాధర్, సంఘ సభ్యులు హనుమాండ్లు, విరిగిరి గంగారాం, ఆర్కె. ప్రజాపతి, సిర్పూర్ చిన్నయ్య, జిల్లా మాజీ అధ్యక్షులు చందూర బాబు, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోళ్ల లక్ష్మీ నారాయణ, బిజెపి నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది

పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు చిన్నయ్య

ప్రజాపక్షం/నిజామాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగులకు చెందాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని పిఆర్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో జరిగిన పిఆర్‌టీయు తెలంగాణ జిల్లా కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెల్త్ కార్డ్స్ వర్తింపజేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ అమలుపర్చాలని డిమాండ్ చేశారు. రత్నాకర్, బుచ్చన్న, మనోహర్ రావు, లక్ష్మీ రాజం, నాగేశ్వర్‌రావు, ఆనంద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడి పిల్లలు - ప్రతిభ గల పిడుగులు

ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో జడ్జి రాధిక, డిఇఒ భోజన్న

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవన్‌లో ఏకలవ్య ఫౌండేషన్ మరియు దివ్యాంగ శక్తి ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 10వ తరగతి ప్రతిభావంతులకు, దివ్యాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, దివ్యాంగ విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిర్మల్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి రాధిక, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల ఆధునిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కష్టపడే తత్వం పట్టుదల ఆటే ఎక్కడ చదువుకున్నా విజయం సాధించవచ్చని, అందుకు ఈ వేదికపై ఉన్న విద్యార్థులే నిదర్శనమని కొనియాడారు. విద్యార్థులంతా జీవితంలో ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించి దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. విద్యా రంగంలో ఏకలవ్య ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో వారు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అతిథులు అభినందించారు. ప్రభుత్వ బడి పిల్లలు ప్రతిభ గల పిడుగులు అని ఈ విద్యార్థులు ప్రపంచానికి చాటి చెప్తున్నారని ప్రశంసించారు.

## ఆపదలో అండగా సిఎం సహాయ నిధి



**ప్రజాపక్షం / మందమర్రి :** ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో పెద్ద భరోసాగా నిలుస్తోందని అదిలోపేట గ్రామ సర్పంచ్ నెండుగురి పున్నం పేర్కొన్నారు. మందమర్రి మండలంలోని అదిలోపేట గ్రామానికి చెందిన నెండుగురి సత్యనారాయణకు మంజూరైన రూ. 31 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అమలు చేస్తున్న ఈ పథకం ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు వరంలా మారిందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి తక్షణ సహాయం అందడం వల్ల కుటుంబాలపై పడే భారాన్ని కొంతవరకు తగ్గించగలుగుతున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలనువినియోగించుకోవాలని సూచించారు. ఉపసర్పంచ్ రాజన్న, కాంగ్రెస్ మండల నాయకులు ఆకుల అంజి, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై మాట్లాడలేక బిజెపి వ్యక్తిగత విమర్శలు చేస్తోంది

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల గురించి మాట్లాడలేని బిజెపి నాయకులు వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలతో కాలక్షేపం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ క్యాతనపల్లి మునిసిపాలిటీ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ విమర్శించారు. రామకృష్ణాపూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ కృషితో రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఎన్‌టిపిసి విస్తరణ, చెన్నూరు జోడువాగుల సమస్య పరిష్కారం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు భారీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బిజెపి నాయకులు అభివృద్ధి అంశాలను పక్కనబెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రభాకర్, మల్లేష్, కాంగ్రెస్ నాయకులు గోపు రాజం, బత్తుల వేణు, సత్యనారాయణ, సతీష్, రమేష్, సురేందర్, పుష్ప, దీప పాల్గొన్నారు.



## మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా కిషన్ రావు

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మున్నూరు కాపు సంక్షేమ సంఘం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పెద్దపల్లి కిషన్ రావు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులు నూతన కార్యవర్గాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ జిల్లాలోని మున్నూరు కాపులందరినీ ఒకే తాటిపైకి తెచ్చి సామాజిక ఐక్యతకు కృషి చేస్తామని, యువత విద్యా, ఉపాధి రంగాల్లో ఎదిగేందుకు, వెనుకబడిన కుటుంబాల తోడ్పాటుకు పాటుపడతామని తెలిపారు. నూతన కార్యవర్గంలోని జిల్లా ప్రధాన కార్యదర్శిగా జగడం సత్యనారాయణ, కోశాధికారిగా మనిగొండ వెంకటేశం ఎన్నికయ్యారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా గడ్డల సురేష్, ప్రధాన కార్యదర్శిగా పిరిసింగుల కోటేశ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కుందారపు శంకరమ్మ, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల హరిప్రియ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల అనంతరం, జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి భూమి కేటాయించేలా కృషి చేసిన ఆసిఫాబాద్ మండల రెవెన్యూ అధికారి ఇట్యాల కిషన్ పుట్టినరోజు వేడుకలను నూతన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘం పెద్దలు గజ్జి రామయ్య, ఆసిఫాబాద్ తాలూకా అధ్యక్షులు గాజుల జక్కయ్య, సిర్పూర్ తాలూకా అధ్యక్షులు సుంకరి తిరుపతి, జిల్లాలోని మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## కేజీబీవీ అడ్మిషన్ల మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### మంచిర్యాల జిల్లా విద్యాధికారి, అదనపు కలెక్టర్ చంద్రయ్య

**ప్రజాపక్షం / మంచిర్యాల :** కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని మంచిర్యాల జిల్లా విద్యాధికారి, అదనపు కలెక్టర్ చంద్రయ్య తెలిపారు. కెజిబివిలలో అడ్మిషన్లు పెంచే ఉద్దేశంతో, మరింత మంది బాలికలకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మంచిర్యాల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో నిర్వహించే కెజిబివి అడ్మిషన్ల మేళాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మేళాకు జిల్లాలోని 18 కెజిబివిల ప్రత్యేక అధికారులు, సర్టిఫైడ్ రిసోర్స్ టీచర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫైడ్ రిసోర్స్ టీచర్లు హాజరవుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయాలలో లభించే వసతులు, నాణ్యమైన విద్య, అక్కడ చదివిన విద్యార్థినులు సాధించిన విజయాల గురించి ఈ మేళాలో ప్రదర్శన ఉంటుందని డిఇఓ తెలిపారు. తద్వారా తల్లిదండ్రులు తమ కుమార్తెలకు నాణ్యమైన విద్య అందించేందుకు కెజిబివిలను తప్పనిసరిగా ఎంపిక చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేళా కోసం జిల్లా విద్యాశాఖ పూర్తి ఏర్పాట్లు చేసిందని, హాజరయ్యే తల్లిదండ్రులకు అల్పాహారం అందించడం జరుగుతుందని వివరించారు. అన్ని మండలాల నుండి విద్యార్థినుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మేళాను దిగ్విజయం చేయాలని ఆకాంక్షించారు.

## వాంకిడిలో జియో సేవలు జీరో

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలో జియో నెట్‌వర్క్ పూర్తిగా స్తంభించిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజులుగా సిగ్నల్స్ సరిగా అందకపోవడంతో కాల్స్ మధ్యలో కట్ అవడం, మొబైల్ డేటా పనిచేయకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి. నెట్‌వర్క్ సమస్యల కారణంగా యూపిఐ చెల్లింపులపై ఆధారపడిన వ్యాపారుల లావాదేవీలు నిలిచిపోగా, విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులకు హాజరు కాలేకపోతున్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఫోన్ కాల్స్ కూడా సరిగా కలవకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెల రూ. 300కు పైగా రీఛార్జ్ చేస్తున్నామని, కానీ గత కొన్ని రోజులుగా సిగ్నల్ పూర్తిగా లేకపోవడంతో ఫోన్ ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందని వాంకిడికి చెందిన నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జియో టవర్ ఉన్నప్పటికీ సేవలు అందకపోవడం బాధాకరమన్నారు. సాంకేతిక లోపం కారణంగానే ఈ సమస్య తలెత్తిందని, వెంటనే జియో సంస్థ అధికారులు స్పందించి టవర్‌లోని లోపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టి నెట్‌వర్క్ సేవలను పునరుద్ధరించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యం

**ప్రజాపక్షం / వాంకిడి :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని దొడ్డిగూడ గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో గ్రామ పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, వాంకిడి మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామ ఉపసర్పంచ్ దుర్గం భీంరావు కార్మికులను శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. గ్రామాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ప్రతి రోజు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వారు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. గ్రామాభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. అంతకుముందు ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.విభిన్న శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలం ఇంధన్‌పల్లి గ్రామంలో శనివారం సాయంత్రం ఈత చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడడంతో ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన గాజుల నారాయణ గౌడ్ ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు జారిపోవడంతో చెట్టుపై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గా యాలు కాగా, తోటి గీత కార్మికులు వెంటనే జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా, పరీక్షలు నిర్వహించిన వైద్యులు నారాయణ గౌడ్ రెండు చేతుల మణికట్టులు విరిగినట్లు నిర్ధారించారు. పేద కుటుంబానికి చెందిన గాజుల నారాయణ గౌడ్‌కు ప్రభుత్వం తక్షణ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.



## యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దినకర్




**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలంలోని కొన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా ఎరువును గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ విమర్శించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ మండల వ్యవసాయ అధికారి ఇప్పటి వరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల విక్రయాలపై పర్యవేక్షణ చేయడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఎరువుల కోసం దుకాణాలపై ఆధారపడుతున్న సమయాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తున్న దుకాణాలపై వెంటనే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చురుకుగా వ్యవహరించాలని కోరారు. స్థానిక రైతులు, సిపిఎం సభ్యులు పాల్గొన్నారు.

## నందుపా వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలి


### ఎంఎల్‌సికి వినతి అందించిన గ్రామస్తులు



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి, కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై నిర్మాణంలో ఉన్న నందుపా వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు ఎంఎల్‌సి దండే విఠల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వంతెన నిర్మాణ పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. నందుపా వంతెన వాంకిడి మండలం, కాగజ్‌నగర్ ప్రాంతాల మధ్య రాకపోకలకు అత్యంత కీలకమైనదని, ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారని వివరించారు. వంతెన పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, ధనం వృథా కావడంతో పాటు వర్షాకాలంలో రాకపోకలు మరింత కష్టసాధ్యంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిని స్వీకరించిన ఎంఎల్‌సి దండే విఠల్ సానుకూలంగా స్పందించారు. ప్రజల ఎన్నో సంవత్సరాల ఆకాంక్ష అయిన ఈ వంతెన నిర్మాణం త్వరగా పూర్తవాలని కనర్‌గాం ఉపసర్పంచ్ జీవన్ దుర్గే కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## సిర్ప లింగం కళకు దక్కిన గౌరవం

### 50 వేల నగదు బహుమతి అందజేసిన సంజయ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కళాకారుడు, జిల్లా వాగ్గేయ కారుడిగా పేరొందిన ఆర్సపల్లి సిర్ప లింగం కళకు గౌరవం దక్కిం ది. ఆదివారం నగరంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు సంఘంలో మున్నూరుకాపు ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఎస్సెస్సీ, ఇంటర్‌లలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాశరథి పాట ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానల మెంతో అనే పాటను ఆలపించటంతో వేదిక మీద ఉన్న అతిథులు మంత్రముగ్ధులయ్యారు. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్ రూ.50వేల నగదుతో సత్కరించారు.